క్లుప్తంగా

రామమందిర ప్రారంభోత్సవం



కొలువు తీరిన సీతారాములు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని ఎన్‌కేరాజపురం గ్రామంలో శ్రీరామమందిర ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించిన గ్రామస్తులు ఆలయం ఆవరణలో ప్రత్యేక పూజలు, యాగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు కళశాలతో సీతారాములను కొలిచేందుకు బారులు తీరారు.

26న రౌండ్ టేబుల్ సమావేశం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురంలో విద్యార్థి, యువజన, గిరిజన, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్టు గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబ, ఆరిక ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యార్థుల మరణాలపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కుసిమి సంతలో వైద్య శిబిరం రేపు

సీతంపేట: ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని కుసిమి వారపు సంత వద్ద ఉచిత మెడికల్ క్యాంపు శనివారం ఏర్పాటు చేయనున్నట్టు ఎస్‌ఐ జగదీష్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యసేవలను పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

తాగునీటి కోసం ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ సత్యనారాయణ

కొమరాడ: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా 80 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



వీరఘట్టం: స్థానిక గణలక్ష్మీ సంతోషిమాత ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో భక్తులు హోమం గుండం వద్ద పూజలు చేశారు. అనంతరం పసుపు, కుంకుమలతో సంతోషిమాతకు ఉపవాస దీక్షలతో పూజలు చేశారు. శనివారం ముగింపు సందర్భంగా అఖండ అన్నసంతర్పణ కార్యక్రమం చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

వాహనాల వేలం



వేలం పాటను నిర్వహిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

గరుగుబిల్లి: సారాతో పట్టుబడ్డ వాహనాలను గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సమక్షంలో వేలం నిర్వహించారు. గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు వాహనాలు, చినమేరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు వాహనాలను వేలం వేశారు. పార్వతీపురం ఎంవీ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించిన ధరకు పైబడి వేలం పాట పాడాలని వేలం పాటలో పాల్గొనేవారికి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అమ్మన్నరావు, సిబ్బంది ఎన్.ఈశ్వరరావు, జి.రాము తదితరులున్నారు.

నృసింహస్వామికి ప్రత్యేక పూజలు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది సమీపంలో వేంచేసిన లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు పి. శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించి, తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వలంటీర్ల సేవలు ఆదర్శం

● వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



కురుపాం: ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సత్కరిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు తదితరులు

కురుపాం: రాష్ట్రంలో వలంటీర్ల సేవలు ఆదర్శనీయమని, నిస్వార్థమైన సేవలతోనే గుర్తింపు సాధ్యమని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంత్రి పథం కార్యాలయంలో ఎంపీడీఓ అప్పారావు ఆధ్వర్యంలో మండలంలోని బియ్యాలవలస, గొటివాడ, కిచ్చాడ, కురుపాం 1, 2, రస్తాకుంటుబాయి సచివాలయాల పరిధిలో ఉత్తమ సేవలందించిన 84 మంది గ్రామ వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, వజ్రాపురస్కారాల ప్రదానోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ ఉత్తమ సేవలతోనే గుర్తింపు లభిస్తుందన్నారు. కరోనా వంటి కష్ట కాలంలో ప్రాణాలకు తెగించి వలంటీర్లు ఉత్తమ సేవలు అందించారన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సన్మానించారు. సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, కురుపాం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, స్వామియాజులు, గౌడు సంతోషిరాణి, మండల కన్వీనర్ గౌరీ శంకరరావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కోటేశ్వరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు సన్మానం

సీతంపేట: మండలంలోని పెద్దూరు గ్రామ సచివాలయం పరిధిలో గ్రామ వలంటీర్లకు సర్పంచ్ హిమరక ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ దేశంలో మిగిలిన రాష్ట్రాలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో పాలకొండ ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, గ్రామకార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు భేష్

కొమరాడ: వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్లు చేస్తున్న సేవలు భేష్ అని ఆ పార్టీ నాయకులు కళింగి మల్లేశ్వరరావు అన్నారు. విక్రంపురం, పరుశురాంపురం, కుంతేస్ గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న వలంటీర్లను విక్రంపురం గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి బీమయ్య, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



కొమరాడ : వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతంపేట: గ్రామ వలంటీర్లకు సన్మానం చేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి

సీజనల్ వ్యాధులపై తస్మాత్...

సీతంపేట: సీజనల్ వ్యాధుల పట్ల క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి, మండలంలోని కుశిమి, దోనుబాయి పీహెచ్‌సీలు, గిరిజన సంక్షేమ వసతిగృహాలను గురువారం ఆయన సందర్శించారు. పీహెచ్‌సీల్లో ల్యాబ్, రికార్డులు తనిఖీలు చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఎన్‌ఆర్‌సీలో ఉన్న చిన్నారులకు పోషకాహారం ఎలా అందిస్తున్నారనేది అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది అడ్మిట్ అయ్యారు, వారి ఆరోగ్యం ఏ మేరకు అభివృద్ధి చెందిందనేది పరిశీలించారు. ప్రతీ రోజు చేస్తున్న రోగ నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలు పరిశీలించారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు నిర్ధారణ అయితే వెంటనే ఆ ప్రాంతంలో నివారణా చర్యలు చేపట్టాలన్నారు. మందులు, వార్డు, వ్యాక్సిన్ నిల్వలు తనిఖీ చేశారు. దోమల ఆవాస ప్రాంతాల్లో సింథటిక్ పైరాత్రిన్ స్ప్రేయింగ్ చేయించాలన్నారు. వసతిగృహాలను సందర్శించి సిక్‌రూంలో అనారోగ్య లక్షణాలున్న విద్యార్థులను పరీక్షించారు. అక్కడ కిటికీలకు మెస్‌లు వేయించాలన్నారు. ఆయన వెంట ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏఎంఓ సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కుశిమిలో ల్యాబ్ రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఓ జగన్‌మోహన్‌రావు

అండగా ఉంటాం..

పాలకొండ రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలందించిన సవిరిగాన శివకుమార్ లేని లోటు తీర్చలేదని శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. అనారోగ్యంతో అకాల మరణం చెందిన శివకుమార్ స్వగ్రామం గోపాలపురానికి గురువారం వెళ్లిన విక్రాంత్ ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా సమకూరిన రూ.5లక్షల నగదుకు సంబంధించిన చెక్కును ఆయన కటుంబసభ్యులకు అందించారు. పార్టీ తరపున, వ్యక్తిగత ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నాయన వెంట ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాస్, వాకముడి అనీల్‌కుమార్, సర్పంచులు లోలుగు విశ్వేశ్వరరావు, గవర రాజశేఖర్, జనార్ధనరావు, కరణం బాబ్జీరావు, ఎంపీటీసీలు కోట అజేయ్‌కుమార్, మజ్జి నవీన్‌కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రణస్థలం రాంబాబు, పార్టీ నాయకులు శేఖర్, చింత సంఘంనాయుడు, గోవిందరావు తదితరులున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

పాలకొండ రూరల్: క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థులకు అవసరమని స్థానిక సత్యసాయి విద్యా సంస్థల నిర్వాహకులు బి.లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ స్కాట్ డే సందర్భంగా గురువా రం తమ విద్యార్థులచే పట్టణ ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక ప్రదర్శనలు చేయించారు. ఈ క్రమంలో స్కాట్స్ అండ్ గైడ్స్‌పై ఎం.నరేంద్ర, కె.క్రిష్ణశంకర్ అవగాహన కల్పించారు. విద్యతో పాటు స్కాట్‌లో తర్ఫీదు పొందటం వలన క్రమశిక్షణ, సమాజంలో నడుచుకోవాల్సిన విధానం, శరీరానికి చక్కనైన వ్యాయామం లభిస్తుందన్నారు. ఆర్మీలో శిక్షణలో అందించే మెలకువలు స్కాట్ ద్వారా విద్యార్థులకు అందించటం జరగుతుందన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొమరాడ: మండలంలో పూడేస్ గ్రామానికి చెందిన కలప జ్ఞానేశ్వరరావు, సర్వపాడు గ్రామానికి చెందిన గుణపూర్ భాస్కరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట పార్టీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, సీనియర్ నాయకులు శెట్టి మధుసూదనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం, కొమరాడ, శివిని పీఏసీఎస్ చైర్మన్లు మరడాన సూరపునాయుడు, పప్పల గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.



జ్ఞానేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటాం..: ఎమ్మెల్యే

భామిని: పేదలు, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని పెద్దదిమిలిలో కాలు పోగొట్టుకొని దివ్యాంగుడుగా మారిన కింతలి రాములుకు ట్రై సైకిల్‌ను గురువారం ఆమె అందజేశారు. సర్పంచ్ తొగరాన శ్రీను ద్వారా రాములకు జరిగిన నష్టాన్ని తెలుసుకొని ఈ సైకిల్‌ను ఎమ్మెల్యే అందజేశారు. ప్రజల బాధల్లో తాము అండగా ఉంటామన్నారు. ఉప సర్పంచ్ బుయ్యాల జయరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



రాములుకు ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి : సీఐ

సాలూరు: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు వర్తకులు సహకరించాలని పట్టణ సీఐ జి.దేముడు బాబు అన్నారు. పట్టణంలో తన కార్యాలయంలో మెయిన్‌రోడ్డు నుంచి వడ్డివీధి రామమందిరం వరకు గల పలువురు వర్తకులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపార దుకాణాల ముందు రోడ్డుపై వాహనాలు నిలుపుదల చేయవద్దని దుకాణాలకే వచ్చే వినియోగదారులకు సూచించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాలని తెలిపారు. ఈ మేరకు వర్తకులతో ట్రాఫిక్‌పై ప్రతిజ్ఞ చేయించారు.



మాట్లాడుతున్న సీఐ దేముడుబాబు

గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

కొమరాడ: గిరిజనులు ఆర్థికంగా ఎదిగి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అవగాహన కల్పించాలని ఏపీఎం రాణి రత్నకుమారి అన్నారు. మండలంలోని పెదశాఖ గ్రామంలో గిరిజనులకు వీడీవీకే ద్వారా నాలుగు రోజుల పాటు కొండచీపుర్లు తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు కొండచీపుర్లు తయారీపై శిక్షణ ఇచ్చి రోజుకు ర.150 చొప్పున టీఏ, డీఏ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కొమరాడ ఇన్‌చార్జి ఏపీఎం వెంకటరమణ, ఎఫ్‌పీఓ సీసీ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెదశాఖలో కొండచీపుర్లు తయారీపై శిక్షణలో మహిళలు

అవగాహన తప్పనిసరి

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు నేల ఆరోగ్య పరిరక్షణ, భూసార పరీక్షలపై అవగాహన తప్పనిసరని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్ పాల్ అన్నారు. స్కూల్ సోయిల్ హెల్త్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వ్యవసాయం అవగాహన ఉండాలన్నారు. భూసార పరీక్షల నిర్వహణ, తద్వారా సుస్థిర వ్యవసాయ అభివృద్ధి సాధించడంపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఆర్. శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ అలజంగి నిర్మలజ్యోతి, శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి, మండల వ్యవసాయాధికారి పి.నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు .

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

కురుపాం: మండల కేంద్రంలోని మంతినివీధిలో గురువారం ఉదయం మంతిని సంతోష్‌కు చెందిన పెంకుటిల్లులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు ధ్వంసమయ్యాయి. వెంటనే స్థానికులు గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఇంట్లో సామగ్రి ధ్వంసం కావడంతో సుమారు ఐదు లక్షల రూపాయిలు వరకు నష్టం జరిగి ఉండవచ్చునని కుటుంబ సభ్యులు తెలిపారు.



మంటలను ఆపుతున్న అగ్నిమాపక సిబ్బంది

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని 15వ వార్డుకు చెందిన తులసి నారాయణమ్మకు రూ.4లక్షలు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేశారు. నారాయణమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా ఆమెకు సాయం కోసం శాసన మండలి ప్రభుత్వ విప్ సిఫార్స్ చేయడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేశారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ విక్రాంత్‌ల ఆధ్వర్యంలో చెక్కును నారాయణమ్మ భర్త భాస్కరరావుకు గురువారం అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తుమ్మగుంట శంకరరావు, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్‌రావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రణస్థలం రాంబాబు, ఎంపీటీసీ కోట అజయ్, ముడిల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న రాజశేఖరం, విక్రాంత్

అర్హులకు అండగా సీఎం సహాయ నిధి

వీరఘట్టం: ముఖ్యమంత్రి సహాయ నిధి అర్హులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఇటీవల హార్ట్ ఎటాక్‌తో మృతి చెందిన వీరఘట్టం మండలం సంత-నర్సిపురం గ్రామానికి చెందిన విద్యార్థి గోల శివకుమార్ కుటుంబానికి ఎమ్మెల్యే కళావతి అండగా నిలిచారు. ఈ కుటుంబ పరిస్థితిని ప్రభుత్వానికి తెలియజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన రూ.1 లక్ష చెక్‌ను గురువారం బాధితుని తండ్రి చిన్నంనాయుడుకి వండవ క్యాంపు కార్యాలయం వద్ద అందజేశారు. ఈ డబ్బులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీరఘట్టం పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి రూ.1లక్ష సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

రైతులకు బ్యాంకు వడ్డీలపై అవగాహన

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో కురుపాం కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ మురళీ ఆధ్వర్యంలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు ఇన్సురెన్స్ గురించి చాలా వరకు తెలియదని వాటిని తెలుసుకోవాలన్నారు. కోఆపరేటివ్ బ్యాంకులో రుణాలపై వడ్డీ తక్కువగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న రెండు పథకాల గురించి వివరించారు. 18–50 సంవత్సరాల మధ్య ఉన్నవారు సంవత్సరానికి రూ.426 కడితే రూ.2లక్షల బీమా ఉంటుందన్నారు. 18–70 సంవత్సరాల మధ్య ఉన్నవారు సంవత్సరానికి రూ.20 లు కడితే రూ.2లక్షల బీమా ఉంటుందన్నారు. సహజ మరణానికి వర్తించదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చైతన్య కుమార్, ఆనంద్, చినమేరంగి పీఏసీఎస్ సిబ్బంది బి.రామారావు, ఎంపీటీసీ లక్షుంనాయుడు, రైతులు పాల్గొన్నారు.



బ్యాంకు రుణాలపై అవగాహన కల్పిస్తున్న కురుపాం కోఆపరేటివ్ బ్యాంకు మేనేజరు మురళి

గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యం



షేకుపాడు గ్రామ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు

● ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. బియ్యాలవలస పంచాయతీ షేకుపాడు గ్రామానికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.47లక్షలతో వేసిన 750 మీటర్ల బీటీ రహదారిని గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పుష్పశ్రీవాణి మాట్లాడుతూ తాను ప్రతిపక్షంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు షేకుపాడు గ్రామస్తులు రహదారి కావాని కోరారని, అధికారంలోకి రాగానే రహదారి మంజూరు చేస్తానని మాట ఇచ్చానన్నారు. టీడీపీ పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని, తమ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానన్నారు. నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమన్నారు. పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో గత టీడీపీ పాలనలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండిపోయిందని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రహదారులు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, నాడు నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం, తదితర సౌకర్యాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, టి.వి.ఎస్.స్వామియాజులు, గౌడు సంతోషిరాణి, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, కళింగ వైశ్య, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్లు కొత్తకోట సురేష్, గవర విజయ్, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

తగాదాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ అమ్మన్నరావు

గరుగుబిల్లి: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలలో ప్రజలు వ్యక్తిగత తగాదాలకు, ఘర్షణలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ అమ్మన్నరావు అన్నారు. మండలంలోని ఉల్లిబద్రలో ఎన్నికలపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. వ్యక్తిగత తగాదాలకు పాల్పడి, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. స్నేహపూర్వక వాతావరణంలోనే ఎన్నికలు జరిగేలా ప్రజలు తమ ప్రవర్తన ఉండాలన్నారు. కార్యక్రమంలో పలువురు పెద్దలు, యువత, మహిళా పోలీస్ తదితరులు పాల్గొన్నారు.